క్లుప్తంగా

రూ.15 వేలు విలువైన క్రీడాపరికరాలు వితరణ



వినుకొండ(నూజెండ్ల): రూరల్ మండలంలోని నాగులవరం గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పి.చిన అమరయ్య రూ.15 వేలు విలువ చేసే క్రీడా సామగ్రి అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షణ్మోహనరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతలు సహకారాన్ని సద్వినియోగం చేసుకోని క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, యల్లమందరావు, శిరీషా, దీప్తిలత, పద్మకుమారి, శైలజ, జక్రయ్య క్రీడాకారులు పాల్గొన్నారు.

కళాశాలల అసోసియేషన్ నూతన కార్యవర్గం



నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట జూనియర్, డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా మైనీడి శ్రీనివాసరావు (భావన కళాశాల), కార్యదర్శిగా కాకి సాంబశివరావు (ఆక్స్‌ఫర్డ్ విట్ కళాశాల) ఎన్నికయ్యారు. అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా కోమటినేని నాసరయ్య (కృష్ణవేణి కళాశాల), ఉపాధ్యక్షునిగా కపలవాయి రాజేంద్రప్రసాదు (వాగ్దేవి కళాశాల), కోశాధికారిగా వి.శ్యామ్ కుమార్ (వాసవి కళాశాల), జాయింట్ సెక్రటరీగా మేదరమెట్ల శ్రీనివాసరావు (కృష్ణవేణి కళాశాల), కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి వివిధ కళాశాలల ప్రతినిధులు కొల్లి బ్రహ్మయ్య, నాతాని వెంకటేశ్వర్లు, రాయల శ్రీనివాసరావు, పాశం కృష్ణారావు తదితరులు అభినందనలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం



నాదెండ్ల: మండలంలోని జంగాలపల్లి గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నరసరావుపేటకు చెందిన ఎంవీ రెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన గ్రామంలోని పాఠశాలలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు 200 మందికి కంటికి సంబంధించిన వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందుల్ని అందజేశారు. కళ్లజోళ్లు కావల్సిన వారికి 30 శాతం రాయితీపై ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫణిదంలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



సత్తెనపల్లి: గర్భిణులకు అవసరమైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడం అభినందించాల్సిన విషయమని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయి తేజ రెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదం పీహెచ్‌సీలో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు రాగి మాల్ట్, పులిహోర, అరటి పండ్లు పంపిణీ చేశారు. మొత్తం 69 మందికి ఈ పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పి.శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ జీవీసీకే మీనాక్షమ్మ, సూపర్‌వైజర్లు ఎ.వరలక్ష్మీ, జె.సంపూర్ణమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ మెమోరియల్ శాఖ గ్రంథాలయ సందర్శన



సత్తెనపల్లి: పట్టణంలోని వైఎస్సార్ మెమోరియల్ శాఖ గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అలాగే గ్రంథాలయానికి సంబంధించిన గదుల అద్దెలు సక్రమంగా చెల్లించాలని గ్రంథాలయంలోని షాపుల వారిని ఆదేశించారు. వారిని పిలిపించి అద్దెలు సక్రమంగా చెల్లించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రజిని తదితరులు ఉన్నారు.

పల్లెల అభివృద్ధే దేశాభివృద్ధి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ఈపూరు: రైతులు అభివృద్ధి చెందినప్పుడే దేశాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని వనికుంట గ్రామంలో మంగళవారం ఎర్రజాల బాటలో గ్రావెల్ రోడ్డు నిర్మించేందుకు శంకుస్థాపన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీవీ ఆంజనేయులు రిబ్బన్ కట్ చేసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో రైతులు పొలాలకు వెళ్లేందుకు రహదారి వేయడం ఆనందంగా ఉందని, అలాగే గ్రామాల అభివృద్ధికి తమవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటసుబ్బయ్య, గ్రామస్తులు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మాతా,శిశు మరణాల నియంత్రణకు చర్యలు

వైద్యాధికారి రమ్య



ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి రమ్య

శావల్యాపురం: కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు మాతాశిశు మరణాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి రమ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది గర్భిణులను గుర్తించి ప్రారంభ దశ నుంచి ప్రసవమయ్యే వరకు మెరుగైన వైద్య సేవలు అందేలా బాధ్యత వహించాలన్నారు. వైద్య పరీక్షల్లో భాగంగా రక్తహీనత తక్కువగా ఉన్నవారికి ప్రభుత్వ పరంగా అంగన్‌వాడీ సెంటరు ద్వారా పోషకాలు కల్గిన ఆహారం అందేలా వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలన్నారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండేలా ప్రసవం జరిగే వరకు నిరంతరం గర్భిణులను పర్యవేక్షణ చేస్తూ బీపీ, షుగర్, తదితర వాటి నుంచి సంరక్షించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకంలో తప్పనిసరిగా గర్భిణులు నమోదు చేయటం ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు పారదర్శకంగా అందుతాయన్నారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులను 100 మంది వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూత్రాలు వివరించటంతో పాటు ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరిగేలా క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వైద్య ఆరోగ్య సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టల్‌లో సదుపాయాలు సమకూర్చండి

- డాక్టర్ చదలవాడ అరవిందబాబు
- బీసీ సంక్షేమ హాస్టల్‌లో తనిఖీలు



హాస్టల్‌లో సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న విద్యార్థులు

నరసరావుపేట: పట్టణంలోని బీసీ సంక్షేమ హాస్టల్ డైనింగ్ హాల్లో టేబుల్స్, కుర్చీలు, వసతి గదుల్లో ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులను కోరారు. మంగళవారం హాస్టల్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్‌లోని ప్రతి గదిని పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు చెప్పాలని, వాటికి పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. ఆహారం నాణ్యత సరిగా లేకపోవడం, డైనింగ్ హాల్లో సదుపాయాల లేమీపై విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సదుపాయాలపై ఎమ్మెల్యే అధికారులను నిలదేశారు. సాధ్యమైనంత త్వరగా వాటిని ఏర్పాటుచేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

వేర్వేరు గ్రామాల్లో డయేరియాపై కార్యక్రమం



అతిసార వ్యాధిపై జాగ్రత్తలు వివరిస్తున్న దృశ్యం



స్టాప్ డయేరియాపై నిర్వహించిన ర్యాలీ

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని శివాపురం గ్రామపంచాయతీ ఎంపీపీ స్కూల్‌లో సర్పంచ్ కమతం సుబ్బమ్మ అధ్యక్షతన స్టాప్ డయేరియా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల రిసోర్సు కోఆర్డినేటర్ ప్రభాకర్ మాట్లాడుతూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని వివరించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ ప్రదీప్, హెచ్ఎం పద్మావతి, ఎం.రక్షణ, భార్గవి, విద్యార్థులు, అంగన్‌వాడీ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్ల మండలంలో...

నూజెండ్ల మండలం కొండలరాయునిపాలెం గ్రామంలో విద్యార్థులకు డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, ప్రధానోపాధ్యాయులు కె.వి.కృష్ణారావు, ఉపాధ్యాయులు శ్రీనునాయక్, అశోక్‌బాబు, మోహనరావు, గోపికృష్ణ, శ్రీనివాస్ నాయక్, అంగన్‌వాడీ టీచర్లు సరోజని, సుజాత, ఆశ కార్యకర్తలు సుకన్య, రత్న భాస్కరరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించు.. ప్రాణం నిలుపు



ధూళ్ళిపాళ్లలో మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు



మాట్లాడుతున్న పారా లీగల్ వలంటీర్ జక్కుల లక్ష్మీనారాయణ, పక్కన దివ్వెల, బీఎల్

సత్తెనపల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పిడుగురాళ్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రాంబాబు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు వారి ఆదేశానుసారం సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు సూచనల మేరకు మోటారు వాహనాల చట్టంపై సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్లలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వాహనదారులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే ప్రమాదాల బారిన పడటమే కాక ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయం కావడం వల్ల చనిపోతున్నారని, అందువల్ల ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించకపోవడం చట్టరీత్యా నేరమన్నారు. అంతేకాకుండా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే వాహన యజమానులకు, తల్లిదండ్రులకు కూడా శిక్షలు పడతాయన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కచ్చితంగా పొందాలన్నారు. సకాలంలో వాహనానికి ఇన్సూరెన్స్ చెల్లించాలని, ఇంకా పలు అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, పారా లీగల్ వలంటీర్ కోటా బాబురావు రోడ్డు భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెల్మెట్ వల్ల ఉపయోగం, మండల న్యాయ సేవ సాధికార సంస్థ వల్ల ప్రజలకు కలిగే ఉపయోగాలు వివరించారు. సదస్సులో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ వీరబాబు, కానిస్టేబుల్ బాజీ, సాంబిరెడ్డి, స్థానిక పెద్దలు బైరపు తిరుపతిరావు, బండారుపల్లి ప్రసాదరావు, బత్తుల వెంకటస్వామి, లింగిశెట్టి సూరిబాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు కారుమంచిలో ఉచిత కంటి వైద్యశిబిరం

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలోని ప్రధాన కూడలిమార్గం గ్రంథాలయం సెంటరులో డాక్టరు రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ కంటి వైద్యశాల వారి సారథ్యంలో ఉచితంగా కంటి వైద్యశిబిరం నేడు ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం అవుతుందని వైద్యశాల ప్రతినిధి తెలిపారు. ఈకంటి వైద్యశిబిరంలో వైద్య సేవలు పొందే వారందరు ఆరోగ్యశ్రీ కార్డు,హెల్త్ కార్డు, ఆధార్, రైస్‌కార్డు, ఏమైనా ఆధారాలతో శిబిరంలో నమోదు చేసుకోవాలన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈశిబిరంలో వైద్యులు సూచించిన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9133667555 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

స్టడీ సర్కిల్స్ ద్వారా డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వాలి

సత్తెనపల్లి: రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్స్‌ను మళ్లీ పునరుద్ధరించి డీఎస్సీకి బహుజన నిరుద్యోగ యువతీ, యువకులకు వసతితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వాలని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ (జేబీపీ) పల్నాడు జిల్లా అధ్యక్షుడు జె.విజయ్ కుమార్ మంగళవారం డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తుండటంతో దళిత, గిరిజన, మైనార్టీ తదితర వర్గాల వారు ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా పోటీ పరీక్షలకు సన్నద్ధం కాలేకపోతున్నారన్నారు. గతంలో పోటీ పరీక్షలకు ఇదే విధంగా శిక్షణ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే ఇప్పుడు కూడా ప్రతి జిల్లాలో అంబేడ్కర్, జ్యోతి బాపూలే శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించాలన్నారు. ప్రతి జిల్లాలో స్టడీ సర్కిల్స్‌కి శాశ్వత భవనాలతో పాటు, హాస్టల్స్, లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నారు. ఆయా విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బడి ఈడు పిల్లలను బడికి పంపాలి



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అచ్చంపేట: బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా బడికి పంపాలని, కూలి పనులకు పంపడం నేరమని స్థానిక జెడ్పీహెచ్ స్కూలు హెచ్ఎం చిగురుపాటి కల్యాణి అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా, జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం అచ్చంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలను తీసుకువచ్చిందన్నారు. పోషక విలువలతో కూడిన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారని చెప్పారు. ఇన్ని వసతులు కల్పిస్తున్న ప్రభుత్వ బడులలో తల్లిదండ్రులు పిల్లలను చేర్పాలన్నారు. కూలి పనులకు పంపి వారి బంగారు భవిష్యత్‌ను అంధకారం చేయొద్దన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో తనిఖీలు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని పలు గ్రామాల్లో విత్తన దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో అరుణ మాట్లాడుతూ మాదల, ముప్పాళ్ళ, దమ్మాలపాడు గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో విత్తనాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. ల్యాబ్ నుంచి రిపోర్టులు అందిన అనంతరం అమ్మకాలు జరపాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా రైతులకు విత్తనాలకు సంబంధించిన బిల్లులను అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మకాలు జరపాలని, అధిక ధరలకు అమ్మినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాలు, లూజు విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే దుకాణాల లైసెన్స్ రద్దు చేయటం జరుగుతుందన్నారు. రైతులకు నాణ్యమైన, వ్యవసాయ శాఖ అనుమతి పొందిన విత్తనాలనే అమ్మాలని సూచించారు.

అర్ధరాత్రి వరకూ.. రాజన్న జయంతి వేడుకలు



జాలాది గ్రామంలో జయంతి వేడుకల్లో కేక్ కట్ చేసి తినిపిస్తున్న అభిమానులు



మాచవరంలో కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుతున్న గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



బుచ్చిపాపన్నపాలెంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

యడ్లపాడు: మరణం లేని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ యడ్లపాడు మండల అధ్యక్షుడు ఘంటా శంకర్ పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్సార్ 75వ జయంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో అర్ధరాత్రి వరకు కొనసాగాయి. యడ్లపాడు ఎస్సీకాలనీ, జాలాది గ్రామం, బీసీకాలనీ, కోట, కారుచోల గ్రామాల్లో ఈ వేడుకల సందర్భంగా కేక్‌లను కట్ చేశారు. వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు పాలభిషేకం చేసి పూలమాలలు వేశారు. వైఎస్సార్ పాలన స్వర్ణయుగమని ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నేతలు కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు కల్లూరి విజయ్‌కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి రాచమంటి చింతారావు, ఏఎంసీవైస్ చైర్మన్ మానుకొండ వీరారెడ్డి, మాజీ వైఎస్ చైర్మన్ ఎం విజయ భాస్కరరెడ్డి, కోఆప్షన్ సభ్యులు షేక్ గౌస్‌సందాని, మాజీ సర్పంచ్‌లు సయ్యద్ ముగ్దుం, షంషుజుహా, నాయకులు పిడతల దయాసాగర్, బండ్ల సాంబయ్య, కల్లూరి రామకృష్ణ, కట్టా నాగభూషణం, నాగార్జున, విప్పర్ల కోటయ్య, వైఎస్ కరీముల్లా, రాము, రాఘవులు, వాసు, కర్రా అల్ఫోన్స్, పుల్లగూర ఆదాం, జరుగుల శేషగిరిరావు, మానం శంకరరావు, ఉర్లగుంట శ్రీనివాసరావు, కృష్ణపురపు శివవెంకట్, నరసింహారావు, నూజెండ్ల వెంకట్రావు, కుంచపు బంగారయ్య, రావిపాటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో....



కోట గ్రామంలో రాజన్న చిత్రానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

రొంపిచర్ల: ఆంధ్రరాష్ట్రంలో ప్రజారంజక పాలన చేసి ప్రజల హృదయాల్లో నిలిచిన మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని సంతగుడిపాడు, రొంపిచర్ల, బుచ్చిపాపన్నపాలెం గ్రామాల్లో సోమవారం రాత్రి నిర్వహించిన మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు మహానేతను ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు చేశారన్నారు. రాష్ట్రంలో సామాన్యుల జీవితాలకు భరోసా ఇచ్చిన మహనీయుడు వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కేకులు కట్‌చేసి పంపిణీ చేశారు. అలాగే మండలంలోని నల్లగార్లపాడు, మాచవరం, వి.రెడ్డిపాలెం, రామిరెడ్డిపాలెం తదితర గ్రామాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించి అల్పాహారాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మండల కన్వీనర్ కురుగుంట శ్రీనివాసరెడ్డి, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పడాల శివారెడ్డి, బత్తుల రామకృష్ణ, పల్లకి అంజనారెడ్డి, కాటా రామిరెడ్డి, చిలేకాంపల్లి సుబ్బారెడ్డి, రాజేష్, గెల్లి చినకోటిరెడ్డి, పడాల హనిమిరెడ్డి, గజ్జల ముసలారెడ్డి, పునుగోటి వెంకట్రావు, పోతులూరి సుబ్బారెడ్డి, డీలర్ కోటిరెడ్డి, ఎలికా శ్రీమన్నారాయణ, ఉమ్మారెడ్డి బాబుల్‌రెడ్డి, నామాల ప్రసన్నారెడ్డి, మాదిరెడ్డి బాలకోటిరెడ్డి, బండారు శ్రీను జగన్, చింతగుంట శ్రీనివాసరెడ్డి, ఏరువ సత్యనారాయణరెడ్డి, కీసర బాలిరెడ్డి, గోపు కృష్ణ, గుత్తికొండ నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముడి పదహారురోజుల పండుగ



పూజలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ కోదండరామాలయం తొలి వార్షికోత్సవం గత నెల 24న జరిగిన విషయం విదితమే. మంగళవారం పదహారు రోజుల పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారి దర్శి అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, గోత్రనామ పూజలు నిర్వహించారు. ఈ ఆలయం సుమారు రెండు శతాబ్దాల క్రితం నిర్మాణం కాగా, 2015లో ఆలయ జీర్ణోద్ధరణ చేశారు. రూ.2 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో ఆలయాన్ని నిర్మించారు. గతేడాది జూన్ 7న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, కమిటీ ఉపాధ్యక్షుడు కెల్లంపల్లి అచ్చయ్య, జాయింట్ సెక్రటరీ ఐతా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు గాలి బుచ్చయ్య, కాటా వెంకటేశ్వర్లు, సింగు సత్యనారాయణ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

జోరుగా మిర్చి నారుమళ్ల పనులు



అత్తలూరులో మిర్చి నారుమళ్ల పనులు చేస్తున్న కూలీలు

అమరావతి: ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా జూలై మాసంలో మిర్చి నారుమడులు పోయటానికి వాతావరణం అనుకూలంగా ఉండటంతో మండలంలోని వివిధ గ్రామాలలో నారుమళ్ల పనులు జోరందుకున్నాయి. రెండురోజుల క్రితం కురిసిన భారీ వర్షాల వల్ల భూమిలో పదును పెరగటంతో రైతులు వ్యవసాయ పనులు వేగవంతం చేశారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలలో ఒక్కసారిగా మిర్చి నారుమడుల పనులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు వేయటం దాదాపుగా పూర్తి అవటంతో మిర్చి నారును సాగు చేయటానికి వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు విత్తనాల కొనుగోలుపై దృష్టి సారించారు. అన్ని గ్రామాలలో ఒకేసారి మిర్చి నారు సాగు చేయటంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో పక్క గ్రామాల నుంచి ఎక్కువ కూలీ ఇచ్చి రైతులు నారు మడులు సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలో సుమారు 3000 ఎకరాలలో మిర్చి పైరు సాగు చేసేందుకు నారుమడులు సిద్ధం చేస్తున్నారు.

అంగన్‌వాడీల ధర్నాను జయప్రదం చేయండి

పిడుగురాళ్ల: గురజాల ఆర్డీవో కార్యాలయం వద్ద జరగనున్న అంగన్‌వాడీల ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పిడుగురాళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బందికి సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తల నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఆశా కార్యకర్తలు ఇచ్చిన హామీలకు జీవోను వెంటనే ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు మెనూ ఛార్జీలు, వేతనాలు పెంచడం వంటి పలు డిమాండ్ల సాధన కోసం ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు గురజాల ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు గుర్తుచేశారు. ప్రతి ఒక్కరు హాజరై ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని పిడుగురాళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు



వాహనదారుడిని వివరాలు అడుగుతున్న ఎస్ఐ అమీర్

కారెంపూడి: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను కారెంపూడి ఎస్ఐ కె.అమీర్ హెచ్చరించారు. మితిమీరిన వేగం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. అతివేగంతో వాహనాలు నడపొద్దని విజ్ఞప్తి చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని వాహన చోదకులకు జరిమానా విధించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న వారిని అలా చేయవద్దని హెచ్చరించారు. లారీలు, ట్రాలీలలో కూలీలు పనులకు వెళ్లేటప్పుడు ప్రయాణం చేయొద్దని కోరారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని, మైనర్లకు తల్లిదండ్రులు బైక్ నడిపే అవకాశం కల్పించవద్దని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.